# మినీకథ

## సావిత్రీ అదియుందక్క

సావిత్రి, సత్యారావులమధ్య పెళ్ళి చూపులు జరిగాయి. ఒకరి కొకరు నచ్చారు. అటూ యిటూ పెద్దలకు నచ్చింది.

''మే మిరుపురం వంటరిగా ఓ పావుగంట మా ట్లా డు కు ం టా ం'' అన్నారు కాబోయే పెళ్ళికొడుకు సత్యారావు, అవబోతున్న పెళ్ళికూతురు సావిత్రీను.

"సరే. అదేదో కానీండర్రా!" అని పెళ్ళి పెద్దలు వాళ్ళనో గదిలో విడిచి వీధిలో కెళ్ళారు. గది తలుపులు, గదికిటికీ తలుపులు తెరిచిపెట్టేవున్నాయి. (గమనిక)

"పెళ్ళయిం తరువాత మనమధ్య పేచీ వుండరాదు. ఏదైనా అడిగి తెలుసుకోవాలని వుంటే అడగండి." అంది పె. కూ. సావిత్రి.

"నే అడగాల్సినవి ఇందాకే అయిపోయాయి. మీ రూప గుణాలు వగైరా నచ్చాయి. నా స్థితిగతులన్నీ చెప్పాను. పెళ్ళయింతరువాత చంద్రమండలంలో హనీమూన్ గడపాలి అనే తలకుమించిన కోరికలుగాక మరేమైనా అడగండి తీర్చగలనో లేనో చెపుతాను" పె. కొ. సత్యారావు కాలను సర్దుకుని అన్నాడు ధీమాగా.

"నాకు వంట్లో బాగుండనప్పుడు మీరు వంట చేయాలి. అన్నట్లు మీకు వంటలు, పిండి వంటలు వచ్చా?"

"ఓ బ్రహ్మాండంగా వచ్చు. కొత్తిమీర రసం కాచేసిండి. కొరివికారం కాసేండి. బెండకాయ వేపుడు, దొండకాయ బండ పచ్చడి సమస్తం వచ్చు. వంట చేయటం నా కెంతో సరదా."

"పెళ్ళయిం తరువాత దేశం మొత్తం చూడాలని వుంది. ఆకోర్కె తీర్చగలరా?"




"అందానికి, ఆనందానికి అహ్లాదకరమైన ప్రదేశాలు హనీమూన్‌గా చూసేద్దాం. తర్వాత పుణ్యానికి పురుషార్థానికి తీర్థ యాత్రలు వెళ్ళివద్దాం."

"పెళ్ళాన్ని బానిసగా చూస్తూ కొట్టటం తిట్టటం చేయరాదు."

"పెళ్ళాన్ని కొట్టేవాడు చవట. ఓ వేళ ఏ చవటయినా పెళ్ళాంమీద చేయి చేసుకుంటే వెంటనే ఆ పెళ్ళాం ఆ మొగుడు చవటని లాగి నాలుగు లెంపకాయలేసి అతగాడిని వదిలి చక్కా పోవాలి. అది నా సిద్ధాంతం. స్త్రీ పురుష సమానత్వం నా కెంతో యిష్టం." పె. కొ. సత్యారావన్నాడు.

అప్పై సావిత్రి ఎన్నో అడిగింది. తన కోరికలు బైట పెట్టింది. "అది చేయగలరా? ఇది చేయగలరా?" అంది. అన్నింటికీ ఎస్ అన్నాడు సత్యారావు.

"అన్నీ బాగున్నాయి. చివరికోర్కె తీర్చగలిగితే మిమ్మల్ని నేపెళ్ళాడగలను. అదేంటంటే నేను సిటీబస్సు ఎక్కుతుంటే గుమ్మంలో వున్న కండెక్టరు కాలూ పొట్టా నాకు తగలరాదు. బస్సులో వున్న మగపురుగులు నా తొంటి నొక్కరాదు. నా కాలు తొక్కరాదు. ముందూ వెనుకా వాడి మధ్య నే నలగరాదు. వాళ్ళ నుంచి రక్షించగలరా?" పె. కూ. సావిత్రి అడిగింది.

పె.కొ. సత్యారావు ఈ మాటవింటూనే ఓ గావుకేక వేసి "సావిత్రీ! అదియుందక్క మరేదైనా అడుగుము! నీ కోర్కె తీర్చగలను. ఈ కాలంలో ఏదైననూ సాధ్యమే. కీచకరాదీ రావణులు పెళ్ళాన్ని లాక్కెళితే వాళ్ళని తన్నగలను. కాని, సిటీ బస్సులో మగవాళ్ళ మధ్య నలిగిపోయే పెళ్ళాన్ని రక్షించుకోటం తప్ప" అన్నాడు.

"లేదు స్వామీ, నన్ను బస్సులో రక్షించే నాధుడే కావాలి" సావిత్రి మొండిగా అంది.

"సిటీబస్సు రక్షణ దక్క మరేదైనా కోరుకో సావిత్రీ!" ప్రాధేయ పడ్డాడు పె. కొ. సత్యారావు.

"నా కోర్కిదే."

"అదియుందక్క మరేమైనా కోరుకో."

"అయితే బస్సు రక్షణలేని పెళ్ళి నాకొద్దు" సావిత్రి చెప్పేసింది.

"అసాధ్యము ఈ కోర్కె తీర్చుడము. ఈ పెళ్ళి కావటము" అని సత్యారావు లేచ్చక్కాపోయాడు.

"సిటీబస్సులో పెళ్ళాన్ని రక్షించుకోలేని అసమర్థుడు. పోతేపోనీ" అనుకుంది సావిత్రి.

కుసుమద్దాలి విజయలక్ష్మి

